బాలిక మృతి కేసులో నిందితుడి కోసం గాలింపు

చేబ్రోలు: కొత్తరెడ్డిపాలెం గ్రామంలో మూడురోజుల క్రితం అనుమానాస్పదస్థితిలో మరణించిన 7వ తరగతి విద్యార్థిని పేరుపోగు శైలజ మృతికి కారకుడిగా భావిస్తున్న గ్యాస్ డెలివరీ బాయ్ నాగరాజు కోసం ప్రత్యేక పోలీసు బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. ఇప్పటికే అతని బంధువులతో పాటు, మరి కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. బాలిక తల్లినీ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. నాగరాజు దొరికితేగానీ ఈ కేసులో చిక్కుముడి వీడే అవకాశం లేదు. బాలిక మరణం అనంతరం నిందితుడు నాగరాజు పరారయ్యాడు. అతడి కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు పోలీసు బృందాలు వెళ్లాయి. తెనాలి డీఎస్పీ ఎం. రమేష్ పర్యవేక్షణలో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఒకటి, రెండు రోజుల్లో మిస్టరీని పోలీసులు ఛేదించే అవకాశం ఉంది.

కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి హరిప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 28 ఏళ్ల లోపు వయసు గల అభ్యర్థులకు బెంగుళూరులో 35 రోజులపాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తోపాటు వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ కల్పించి, శిక్షణానంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15వేలకు పైబడిన వేతనంతో నూరు శాతం ఉద్యోగాలను చూపిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 90004 87423 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

సమీపిస్తున్న తుది గడువు

గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో కొనసాగుతున్న ప్రవేశాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కంచికచర్ల గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో బీఏ(చరిత్ర), బీకాం(జనరల్), బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్) కోర్సులలో ప్రవేశాలు జరుగుతున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ బుధవారం తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ ప్రవేశాలకు ఈ నెల 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థినుల కోసం ప్రభుత్వం స్థాపించిన ఈ కళాశాల ప్రస్తుతం విజయవాడ మాచవరంలోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలోని తాత్కాలిక వసతిలో కొనసాగుతుందన్నారు. వివరాలకు కళాశాలలో స్వయంగా కానీ 9705293208 నంబరులో సంప్రదించవచ్చునని తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో రైల్వే ఉద్యోగి మృతి

- మృతుడు కంభం రైల్వేస్టేషన్‌లో గ్యాంగ్‌మేన్
- నాలుగు నెలల కిందట వివాహం
- గుర్తుపట్టలేనిస్థితిలో రావిపాడు రోడ్డులోని కొండపై మృతదేహం లభ్యం


మృతదేహాన్ని కొండ పైనుంచి దించుతున్న బంధువులు


రోదిస్తున్న బంధువులు

కంభం: అనుమానాస్పదస్థితిలో రైల్వే ఉద్యోగి మృతి చెందిన సంఘటన బుధవారం రావిపాడు రోడ్డులోని కొండపై వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే..బాపట్ల జిల్లా మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామానికి చెందిన గద్దల సురేష్(27) రైల్వేలో గ్యాంగ్‌మేన్‌గా పనిచేస్తున్నాడు.నాలుగు నెలల కిందట బంధువుల అమ్మాయితో వివాహమైంది. ఇటీవల బదిలీపై కంభం రాగా భార్య, తల్లితో కలిసి అక్కడే నివాసముంటున్నాడు. గత నెల 17న ఇంట్లో ఉన్న సమయంలో ఉదయం 11 గంటలకు ఫోన్ రాగా బయటకు వెళ్లాడు. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో నెల రోజుల తరువాత బుధవారం రావిపాడు రోడ్డులోని శ్మశానం వద్ద కొండపై మృతదేహాన్ని గుర్తించి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

హత్యా..ఆత్మహత్య..?

ద్రోణాదులకు చెందిన కోటయ్యకు ఇద్దరు కుమారులు ఉండగా మృతుడు సురేష్ చిన్నవాడు. అతడికి ఎవరితో గొడవలు లేవని, చాలా మంచివాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. నాలుగునెలల కిందట బంధువుల అమ్మాయితో పెళ్లి చేశామని, ఇంతలోనే ఇలా జరిగిందని తల్లిదండ్రులు రోదిస్తున్నారు. అయితే, ఇంట్లో ఉన్న సమయంలో ఫోన్ ఎవరు చేశారు? ఆ ఫోన్ వచ్చిన వెంటనే ఎందుకు వెళ్లాడు ? ఆ తర్వాత ఏం జరిగిందన్నది? పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. మృతదేహం ఉన్న పరిసరాల్లో ఎటువంటి ఎటువంటి అనుమానాస్పద వస్తువులు కన్పించలేదు. అక్కడికి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడా? ఎవరైనా తీసుకెళ్లి హత్య చేశారా? అనే విషయాలు విచారణలో తేలాల్సి ఉంది. కుమారుడికి మృతికి కారణమేంటో విచారించి తమకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. సంఘటనా స్థలంలో మృతుడి భార్య, కుటుంబసభ్యులు బోరున విలపించారు.


సురేష్ (ఫైల్)

మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల తీరుపై అసహనం

సురేష్ కనిపించడం లేదని ఫిర్యాదు చేసి నెల రోజులు కావస్తున్నా పోలీసులు జాడ కనిపెట్టలేక పోయారని కుటుంబ సభ్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల కిందట కొండ కింద ఉన్న శ్మశానం పక్కన ఓ ద్విచక్ర వాహనం కనిపించింది. దానిపై ఉన్న నంబర్ సహాయంతో ఫోన్ చేయగా సురేష్‌కు కొంతకాలం క్రితం విక్రయించినట్లు ఆ వ్యక్తి తెలియజేయడంతో వాహనం మృతుడిగా గుర్తించి పోలీసులు దాన్ని స్టేషన్‌కు తీసుకెళ్లారు. మృతుడి బండి దొరికిందన్న విషయం తెలుసుకున్న అతడి తాత సుబ్బారావు బుధవారం పక్కనే కొండపైన పరిసరాల్లో వెతుకుతుండగా గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న మనవడి మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు స్వగ్రామం నుంచి తరలివచ్చారు.

త్యాగాలకు ప్రతీక మొహర్రం

- గ్రామ పురవీధుల్లో పీర్ల ఊరేగింపు
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు


దాచేపల్లిలోని బ్రాహ్మణగడ్డలోని చావిడి వద్ద పీర్లను ఊరేగింపు

దాచేపల్లి: త్యాగాలకు ప్రతీకగా నిలిచిన మొహర్రం వేడుకలను మండలవ్యాప్తంగా బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని చావిడిలలో అలంకరణ చేసిన పీర్లను తెల్లవారుజామున బయటకు తీశారు. పీర్లను పట్టుకుని గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దాచేపల్లిలోని రెండు చావిడిలలో ఏర్పాటు చేసిన గంధం పీర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామ పురవీధుల్లో ఊరేగింపు అనంతరం చావిడిల వద్దకు చేరుకున్నాయి. ప్రదక్షిణల అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో నుంచి పీర్లు పట్టుకున్న వ్యక్తులు దాటారు. చావిడిల చుట్టూ ప్రదక్షిణలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. చావిడిల చుట్టూ పీర్లు తిరిగిన తరువాత అవి చనిపోయాయి. వాటిని నాగులేరులో శుభ్రం చేసిన అనంతరం చావిడిలలో భద్రపరిచారు. దాచేపల్లితో పాటుగా గ్రామీణ ప్రాంతాల్లో కూడా మొహర్రం పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు.

ఘనంగా దాచేపల్లి తిరునాళ్ల..

మొహర్రం పండుగ సందర్భంగా దాచేపల్లి తిరునాళ్ల ఘనంగా జరిగింది. మారుమూల గ్రామాల ప్రజలు దాచేపల్లికి చేరుకుని సందడి చేశారు. జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన జెయింట్ వీల్, ఎగ్జిబిషన్లు తిలకించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఎ.సురేంద్ర బాబు ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారులకు తీవ్ర గాయాలు


ఆస్పత్రిలో గాయాలతో సాజిత్ సుల్తానా

పర్చూరు (కారంచేడు): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలైన ఘటన బుధవారం పర్చూరులో జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిలకలూరిపేట నుంచి చీరాల వైపు వెళ్తున్న జీపులో చిలకలూరిపేటకు చెందిన షేక్ కరీముల్లా తన ఇద్దరి కుమార్తెలతో ప్రయాణిస్తున్నాడు. దాని వెనుక ఓ జనరేటర్ కట్టి ఉంది. ఈ సమయంలో చీరాల వైపు నుంచి పర్చూరు వైపు ఓ కారు వస్తోంది. ఈ క్రమంలో పర్చూరు ఎస్ఎఫ్ఎస్ ఉన్నత పాఠశాల ఎదురుగా రెండు లారీలు రోడ్డు మార్జిన్‌లో ఆగి ఉన్నాయి. వాటిని ఓవర్ టేక్ చేసిన కారు ఎదురుగా వస్తున్న జీపును బలంగా ఢీకొట్టింది. దీంతో జీపుతో పాటు దాని వెనుక కట్టిఉన్న జనరేటర్ రోడ్డు పక్కన బోల్తా కొట్టాయి. ఈ ప్రమాదంలో జీపులో ప్రయాణిస్తున్న కరీముల్లా కుమార్తెలు షేక్ సాజిత్ సుల్తానా, షేక్ నాసిన్‌తానుస్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నామని ఎస్ఐ తెలిపారు.


నాసిన్‌కు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

డ్రాగా ముగిసిన కడప–చిత్తూరు మ్యాచ్

తొలి ఇన్నింగ్ ఆధిక్యతతో కడపకు 3 పాయింట్లు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో అండర్–16 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో భాగంగా కడప, చిత్తూరు జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో 71 పరుగుల ఆధిక్యత సాధించిన కడపజిల్లా జట్టుకు మూడు పాయింట్లు, చిత్తూరు జట్టుకు ఒక పాయింట్ లభించింది. కడపజిల్లా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 255 పరుగులు సాధించగా, చిత్తూరు జట్టు ఓవర్‌నైట్ స్కోర్ తొమ్మిది పరుగులతో చివరిరోజు బుధవారం బ్యాటింగ్ ప్రారంభించి 184 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని టి.జి.కృష్ణప్రసాద్ 49 పరుగులు సాధించగా కడప బౌలర్ టి.లక్షిత్ 20 ఓవర్లకు 51 పరుగులు ఇచ్చి 4వికెట్లు సాధించి చిత్తూరు బ్యాట్స్‌మెన్‌లను కట్టడి చేశాడు. దీంతో కడప జట్టుకు 71 పరుగుల ఆధిక్యత లభించింది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.


టి.లక్షిత్, కడప

'అన్నదాత సుఖీభవ' సత్వరమే అమలు చేయాలి

నరసరావుపేట: తెలుగుదేశం నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకాన్ని త్వరితగతిన అమలుచేసి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు, కౌలు రైతు సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు ఏపూరి గోపాలరావు, వై.రాధాకృష్ణ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, ఏరువాక పౌర్ణమి కూడా అయిపోవడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్న తరుణంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా కేంద్రం ఇచ్చిన రూ.6వేలకు సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఆర్థికసాయాన్ని ప్రతి రైతుతో పాటు, కౌలు రైతులకు కూడా అందజేయాలన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే జీఓను వెంటనే రద్దు చేయించాలని విజ్ఞప్తి చేశారు. 2019 భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేసి ప్రతి కౌలు రైతుకు సీసీఆర్సీ కార్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఏఈఎల్‌సీ స్టీరింగ్ కమిటీ కన్వీనర్‌గా శ్యామ్‌కుమార్


సంఘటితంగా అభివాదం చేస్తున్న ఏఈఎల్‌సీ స్టీరింగ్ కమిటీ సభ్యులు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఆంధ్ర ఇవాంజలికల్ లూథరన్ చర్చి(ఏఈఎల్‌సీ) స్టీరింగ్ కమిటీ కన్వీనర్‌గా రెవరెండ్ ఇసుకపాటి శ్యామ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో బుధవారం ఏఈఎల్‌సీ స్టీరింగ్ కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ ఏఈఎల్‌సీలో నెలకొన్న చీకటిని తరిమేసి, ఫాదర్ హెయ్యర్ ఆశయ సాధన కోసం ఏర్పాటు చేసిందే ఈ స్టీరింగ్ కమిటీ అని చెప్పారు. ఒకే అధ్యక్షుడు, ఒకే రాజ్యాంగం, ఒకే ఎన్నికల అనే నినాదంతో ముందుకు వెళతామని తెలిపారు. ఈ కమిటీలో ఆరు సినడ్‌ల నుంచి సభ్యులు ఉంటారని పేర్కొన్నారు. ఏఈఎల్‌సీని సంస్కరణల బాటలో నడపడమే తమ ఏకైక అజెండా అని పేర్కొన్నారు. రూ.లక్షల కోట్ల విలువ ఉన్న ఏఈఎల్‌సీ ఆస్తులను కొందరు వ్యక్తులు స్వార్థ ప్రయోజనాల కోసం అడ్డగోలుగా అమ్మారని ఆరోపించారు. 2025లో ఏఈఎల్‌సీ నూతన అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు సంఘంలోని సభ్యులు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారని చెప్పారు. అధ్యక్షుడు లేని కారణంగా కోర్టు ఏఈఎల్‌సీని కాపాడేందుకు స్టీరింగ్ కమిటీని ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు శ్యామ్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది దాసరి నవీన్, కమిటీ సభ్యులు వేదాల డైజీబాబు, మురాల రత్నరాజు, చిన్న ఎలీషా, ఆంధ్ర క్రైస్తవ విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ పి. ముత్యం, బాబూరావు, మేరి, జయసుధ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గుంటూరులో న్యూరో సైంటిస్ట్స్ రాష్ట్ర సదస్సు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ విజయ, డాక్టర్ శ్యామ్‌కుమార్, డాక్టర్ కుమార్‌వేలు తదితరులు

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర సదస్సును ఈనెల 19 నుంచి 21 వరకు గుంటూరులో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ చెప్పారు. గుంటూరు కొత్తపేటలోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను పలువురు అసోసియేషన్ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ విజయ మాట్లాడుతూ గుంటూరులోని శ్రీ కన్వెన్షన్ హాలులో సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటిదాకా 200కు పైగా రీసెర్చి పేపర్లు వచ్చాయని తెలిపారు. సదస్సులో పేపర్, పోస్టర్ ప్రెజెంటేషన్లతో పాటు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని ఆమె వెల్లడించారు. ప్రతి ఒక్కరికీ మెదడు సమస్యలపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో 21న బ్రెయిన్ హెల్త్ వాక్‌ను గుంటూరు నగరంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు ఐటీసీ హోటల్ నుంచి గుజ్జనగుండ్ల సెంటర్ వరకు వాక్ జరుగుతుందని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా వంద కోట్ల మందికి పైగా మెదడు సమస్యలతో బాధపడుతున్నారన్నారు. ప్రతి ముగ్గురిలో ఒకరు మెదడు సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తమ జీవిత కాలంలో ఒక్కసారైనా మెదడు సమస్యల బారిన పడతారని పేర్కొన్నారు. ప్రజలకు, వైద్యం చేస్తున్న నిపుణులకు సైతం బ్రెయిన్ చికిత్సల్లో వస్తున్న ఆధునిక చికిత్స విధానాల గురించి వివరించేందుకు రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఐ.బాబ్జీ శ్యామ్‌కుమార్ చెప్పారు. సదస్సుకు హాజరయ్యే వారికి ఆరు క్రెడిట్ హవర్స్‌ను ఏపీ మెడికల్ కౌన్సిల్ ఇస్తున్నట్లు వెల్లడించారు. 20వ తేదీ ఉదయం 10 గంటలకు రాష్ట్ర సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. ఢిల్లీ, చెన్నై, ఛండీఘర్ తదితర ప్రాంతాల నుంచి నిపుణులైన న్యూరో సర్జన్లు, న్యూరాలజిస్టులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. న్యూరాలజీ, న్యూరో సర్జరీలో సీనియర్ వైద్యులు డాక్టర్ మూర్తి, డాక్టర్ విఠల్‌రావులకు లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్స్ అవార్డులు అందిస్తున్నట్లు చెప్పారు. సదస్సులో 16 గెస్ట్ లెక్చర్స్ ఉంటాయని సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ కుమార్ వేలు తెలిపారు. గోల్డెన్ అవర్ చికిత్స విధానాల గురించి వివరిస్తారని, పీజీ వైద్యులకు, యువ వైద్యులకు సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్‌తారకనాథ్, డాక్టర్ ఉప్పుటూరి అరుణ్‌కుమారి, డాక్టర్ ఉప్పాల వేదమ్మ పాల్గొన్నారు.

ఆగస్టు 4న సీనియర్ నేషనల్స్ స్విమ్మింగ్ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే సీనియర్ నేషనల్స్ ఎన్టీఆర్ జిల్లాస్థాయి స్విమ్మింగ్ స్త్రీ, పురుషుల జట్లకు ఆగస్టు నాలుగో తేదీన విజయవాడ గాంధీనగర్‌లోని సర్ విజ్జి స్విమ్మింగ్ పూల్‌లో ఎంపిక చేస్తున్నట్లు స్విమ్మింగ్ ఎన్టీఆర్ జిల్లా సంఘం కార్యదర్శి ఐ.రమేష్ తెలిపారు. 17–25 సంవత్సరాల వయసు కలిగి, స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ)లో గుర్తింపు ఉన్న క్రీడాకారులు మాత్రమే ఈ ఎంపిక పోటీలకు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న క్రీడాకారులు ఈ నెల 30వ తేదీ లోపుగా గాంధీనగర్‌లోని సర్ విజ్జి స్విమ్మింగ్ పూల్ వద్దనున్న జిల్లా సంఘం కార్యాలయంలో పేర్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 25వ తేదీన బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 79895 34719ను సంప్రదించాలని ఆయన సూచించారు.

వైకేఆర్ విద్యా ఉపకారం భేష్



స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, న్యాయ సేవాధికార సేవా సంస్థ కార్యదర్శి లీలావతి, ట్రస్ట్ ఫౌండర్ ఏరువ సాయిరాం


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి
- 1,600 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ.50 లక్షల పంపిణీ
- 26 ఏళ్లుగా పేద విద్యార్థులకు సాయం
- ఇప్పటివరకు రూ.10 కోట్లకు పైగా స్కాలర్‌షిప్‌లు

గుంటూరు రూరల్: విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి చెప్పారు. బుధవారం పెదపలకలూరులో యేరువ కోటిరెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ న్యాయవాది పోలూరు వెంకటరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో 1,600 మంది ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు రూ.50 లక్షల విలువైన మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను మెరిట్ ఆధారంగా ఎంపిక చేసి స్కాలర్‌షిప్పులు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఏరువ సాయిరాం ట్రస్టు ద్వారా చేపట్టిన ఈ కార్యక్రమం అద్భుతమని కొనియాడారు. ప్రస్తుతం స్కాలర్‌షిప్‌లు తీసుకున్న విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకుని పేద విద్యార్థులకు సాయం చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఉద్యోగ రీత్యా విదేశాల్లో స్థిరపడినా సొంత జిల్లాలో విద్యాభివృద్ధి కోసం కృషి చేయడం ఆనందంగా ఉందన్నారు. తండ్రి ఆశయాలను నెరవేర్చడానికి కృషి చేస్తున్న యేరువ సాయిరాంను అందరూ స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ లీలావతి మాట్లాడుతూ 18 ఏళ్లలోపు పిల్లలు ద్విచక్ర వాహనాలు నడపడం ఎంతో ప్రమాదకరమని చెప్పారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాలను నివారించేందుకు అందరూ హెల్మెట్లు ధరించాలని సూచించారు. యేరువ కోటిరెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ యేరువ సాయిరాం మాట్లాడుతూ సొంత ప్రాంతానికి ఎంతోకొంత సాయం చేయాలనే ఉద్దేశంతో తన తండ్రి పేరు మీద ట్రస్టును ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పలకలూరులో హైస్కూల్‌లో భవనం నిర్మించడంతో ఆరంభమైన స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం విరామం లేకుండా 26 ఏళ్ళుగా దిగ్విజయంగా సాగుతోందన్నారు. మిత్రుల సహకారంతో నిరంతరం స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం చేపడతామని ప్రకటించారు. మొత్తం 52 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూలుకు రూ 36,000 చొప్పున, అలాగే డిగ్రీ బీటెక్ మెడిసిన్ వివిధ రకాలైన కోర్సులు చేస్తున్న 500 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 5,000 చొప్పున అందజేశామని పేర్కొన్నారు. సుమారుగా 54 వేల డాలర్లు అంటే రూ.45 నుంచి 50 లక్షలు ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఎన్ని లక్షలు ఖర్చు అయినా నిరంతరం ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని వైకేఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మెంబర్ పోలూరు వెంకటరెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక, గుళ్ళపల్లి సుధీర్, నూనె గంగాధర్ రెడ్డి, యేరువ జగదీశ్వరీ, యేరువ శ్రీవేణి, యేరువ శ్రీలలిత, పాల వర ప్రసాద్, యేరువ రమణి, నూనె ఉమామహేశ్వరరెడ్డి, నూనె వెంకటకోటిరెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామంలోని ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె మృతిపై హత్య కేసు నమోదు చేయాలి

గుంటూరు రూరల్: రెండేళ్ల క్రితం తమ కుమార్తె మరణానికి ఆమె భర్తే కారణమని, అతడిపై హత్యకేసు నమోదు చేయాలని మృతురాలి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. పల్నాడు జిల్లా సాతులూరు గ్రామానికి చెందిన బండారు ఆనంద్ గుంటూరు రూరల్ మండలంలోని రత్నగిరినగర్‌లోని మామ ఇంటికి వస్తూపోతూ ఉండేవాడు. ఈ క్రమంలో అదే కాలనీకి చెందిన జనని అనే యువతిని ప్రేమించాడు. ఇద్దరూ ఇళ్ల నుంచి వెళ్లిపోయి పెళ్లి చేసుకున్నారు. సాతులూరులో కాపురం పెట్టారు. ఈ క్రమంలో జనని గర్భం దాల్చింది. రెండేళ్ల కిందట ప్రసవానంతరం ఆమె మరణించింది. గర్భిణీగా ఉన్నప్పుడు సక్రమంగా చూడకపోవడం, పౌష్టికాహారం ఇవ్వకపోవడం వల్లే తమ కుమార్తె మరణించిందని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. అప్పట్లో ఈ ఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ఇప్పుడు అధికార పార్టీకి చెందిన బాధిత కుటుంబ సభ్యులు ఆనంద్‌పై హత్యకేసు నమోదు చేయాలని నల్లపాడు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. ఇదే విషయంపై రాష్ట్ర హోంమంత్రి పలు ప్రెస్‌మీట్లలో ఈ విషయంపై మాట్లాడారు. ఈ నేపథ్యంలో ఆనంద్‌పై హత్యకేసు నమోదు చేయాలని జనని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నట్టు తెలిసింది.

యువకుడు ఆత్మహత్య


పాయకాపురం(విజయవాడరూరల్): పాతపాడు గ్రామానికి చెందిన యువకుడు ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై నున్న పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. నల్లమోతు సంపత్‌కుమార్(22) ఈ నెల 16వ తేదీన ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో ఇనుపరాడ్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు

సాక్షి
బాపట్ల
గురువారం । 18 । జూలై । 2024



వ్యర్థాలు తొలగించాలి

తెనాలి అర్బన్: పట్టణంలోని గంగానమ్మ పేటలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న బుధవారం పర్యటించారు. రోడ్ల వెంట వ్యర్థాల్ని తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు సీతానగరం వద్ద బుధవారం 2,519 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1393 క్యూసెక్కులు వదిలారు.



ఆర్టీసీ ఈయూ గేట్ మీటింగ్

నరసరావుపేట: ఆర్టీసీ డిపో మేనేజర్ వీరాస్వామి వైఖరిని నిరసిస్తూ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కమిటీ నాయకులు ఆరో రోజు బుధవారం డిపో ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించారు.

పచ్చ గద్ద పన్నాగం

అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రభుత్వ స్థలాలపై వాలడానికి పచ్చ గద్దలు పావులు కదుపుతున్నాయి. విలువైన స్థలాల్ని దర్జాగా కబ్జా చేసేందుకు అధికారుల్ని సైతం పచ్చ నేతలు బెదిరిస్తున్నారు. పర్చూరు నియోజకవర్గం మార్టూరు పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న 2.92 ఎకరాలను స్వాహా చేయడానికి టీడీపీ 'భూ'చోడు పదేళ్లుగా సాగిస్తున్న కబ్జా దందా నియోజకవర్గ ప్రజల్ని విస్మయపరుస్తోంది. పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్నా వెరవకుండా స్థలాన్ని సొంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తుండటం టీడీపీ నేత సాగిస్తున్న అక్రమాలకు పరాకాష్ట. ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ ప్రజా సంఘాలు కూడా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం గమనార్హం.

భూచోడమ్మా.. భూచోడు

- విలువైన స్థలం కొట్టేసేందుకు సిద్ధమైన పర్చూరు పచ్చ నేత
- స్థానిక టీడీపీ నేతను ముందుపెట్టి వ్యవహారం
- మార్టూరు పోలీసుస్టేషన్ పక్కనే 2.92 ఎకరాలు
- స్థలం విలువ రూ.12 కోట్లకు పైగానే
- రాత్రికి రాత్రే స్థలాన్ని చదును చేసిన ముఖ్య నేత అనుచరుడు
- రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించాలని అధికారులపై ఒత్తిడి
- మరో 35 ఎకరాల ఇనాం భూములు కొట్టేసేందుకు సిద్ధం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలోని పర్చూరు నియోజకవర్గంలో మార్టూరు పోలీసుస్టేషన్, కూరగాయల మార్కెట్‌కు మధ్య చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిని అనుకుని సర్వే నంబర్ 640/ఏలో 2.92 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో సుమారు 50 సెంట్ల స్థలం విలువ సెంటు రూ.10 లక్షలు చొప్పున పలుకుతోంది. మిగిలిన 2.42 ఎకరాల్లో సెంటు సగటున రూ.3 లక్షలు చొప్పున రేటు ఉంది. ఈ లెక్కన మొత్తం స్థలం విలువ రూ.12 కోట్లకు పైనే ఉంటుందని అంచనా. దీనిపై పర్చూరు టీడీపీ ముఖ్య నేత కన్నేశారు. ఇందుకోసం స్థానిక టీడీపీ నేతను ముందుపెట్టారు. ముఖ్యనేత ఆదేశాలతో రెండు రోజుల కిందట సదరు నేత జేసీబీతో ఆ ప్రభుత్వ స్థలంలో ముళ్ల కంపల్ని తొలగించి చదును చేయించాడు.

స్థలం తమదేనంటూ అధికారులపై ఒత్తిడి

గతంలో తమ పేరుతో సదరు భూమిలో రెండెకరాలకు పట్టా ఇచ్చారని, దాన్ని రికార్డుల్లో చేర్చి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని టీడీపీ ముఖ్యనేత అనుచరుడు మార్టూరు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చాడు. అయితే అది ప్రభుత్వ స్థలమని, దాన్ని టీడీపీ ముఖ్య నేత పేరుతో నమోదు చేయలేమని స్థానిక తహసీల్దార్ తిరస్కరించారు. దీంతో తమకు అనుకూలమైన తహసీల్దార్‌తోపాటు ఆర్డీవోను నియమించుకుని వ్యవహారం చక్కబెట్టుకునేందుకు ముఖ్య నేత ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ 2.92 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు మార్టూరు మండలంలోనే 35 ఎకరాల బ్రాహ్మణ ఇనాం భూముల్ని స్వాధీనం చేసుకునేందుకు కూడా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారని తెలుస్తోంది. ఇందులో భాగంగా తమ మాట వినని తహసీల్దారుతోపాటు ఆర్డీవోను సైతం బదిలీ చేయించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. గతంలో ఒంగోలులో పనిచేసిన ముఖ్య నేత సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని ఆర్డీవోగా తెచ్చుకుని వ్యవహారం చక్కబెట్టుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.



బాపట్ల జిల్లా మార్టూరులో టీడీపీ ముఖ్య నేత కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న స్థలం ఇదే

గత టీడీపీ ప్రభుత్వంలోనే కబ్జాకు ప్రయత్నం

వాస్తవానికి గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు సదరు నాయకుడు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని స్థలం ఉండటంతో అందరికీ ఉపయోగపడేలా అందులో కల్యాణ మండపం నిర్మించాలని ప్రజలు ప్రతిపాదించారు. మీడియా ప్రతినిధులు సైతం తమకు ఆ స్థలంలో పట్టాలివ్వాలని అధికారుల్ని కోరారు. అయితే, విలువైన స్థలాన్ని ప్రజోపయోగ పనులకే తప్ప మీడియా ప్రతినిధులకు ఇవ్వలేమని అధికారులు స్పష్టం చేశారు. అలాంటిది ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చాక ఆ స్థలాన్ని టీడీపీ ముఖ్య నేత మళ్లీ స్వాహా చేయడానికి ప్రయత్నిస్తుండటంపై స్థానికులు మండిపడుతున్నారు. స్థానిక టీడీపీ నేత చెప్పినట్లు రెండెకరాలు వారికి కేటాయిస్తే ఇన్నేళ్లుగా రెవెన్యూ రికార్డుల్లో ఎందుకు లేదని నిలదీస్తున్నారు. అప్పుడే భూమి కేటాయిస్తే ఇన్నేళ్లపాటు దాన్ని ఎందుకు స్వాధీనం చేసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. కాగా 2.92 ఎకరాలు ప్రభుత్వ భూమేనని రెవెన్యూ అధికారులు కూడా ధ్రువీకరిస్తున్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

- కలెక్టర్‌కు ప్రజాసంఘాల వినతి
- రెవెన్యూ రికార్డుల్లో చుక్కల భూమిగానే ఉందన్న అధికారులు

సాక్షి ప్రతినిధి , బాపట్ల: పర్చూరు నియోజకవర్గం మార్టూరు మండల కేంద్రంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని, కోట్లాది రూపాయల విలువైన ఆ భూమిని కాపాడాలని ప్రజా సంఘాల నేతలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకుడు భార్య పేరున నకిలీ పట్టా సృష్టించి భూమిని కొట్టేసేందుకు దశాబ్దంగా ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలోనూ కబ్జాకు ప్రయత్నించగా అప్పట్లోనే తాము అడ్డుకొని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆగిందన్నారు. తిరిగి టీడీపీ అధికారంలోకి రావడంతో మరోమారు సదరు నేత కబ్జాకు సిద్ధమయ్యారని తెలిపారు. భూమి విలువ రూ.12 కోట్లకు పైనే ఉంటుందన్నారు. ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

రెవెన్యూ రికార్డుల్లో చుక్కల భూమిగా ఉంది: తహసీల్దారు

640/ఏ సర్వే నంబర్ గల భూమి రెవెన్యూ రికార్డుల్లో చుక్కల భూమిగా ఉందని మార్టూరు తహసీల్దారు కె.సంధ్య తెలిపారు. లక్ష్మీదేవి అనే మహిళ తమకు పెట్టిన అర్జీలోని పట్టా లోపభూయిష్టంగా ఉందని, డీకేటీ రిజిస్టర్‌లో కూడా లేదని తెలిపారు. ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కానివ్వమని ఆమె స్పష్టం చేశారు.

న్యూస్‌రీల్

లైంగిక దాడి ఘటనాస్థలిని పరిశీలించిన డీఎస్పీ

ప్రత్తిపాడు: నడింపాలెంలో దళిత బాలికపై లైంగిక దాడి జరిగిన ఘటనా స్థలాన్ని గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ మహబూబ్ బాషా బుధవారం పరిశీలించారు. ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడు గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలికపై ఈ నెల 12న అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వెంకట్ లైంగికదాడికి పాల్పడటం, విషయం తెలిసిన తల్లిదండ్రులు 16న ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేయడం, పోక్సో చట్టంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ మహబూబ్‌బాషా నడింపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని పొలాల్లో లైంగిక దాడి జరిగిన ప్రాంతాన్ని ఇన్‌చార్జి ఎస్‌ఐ రవీంద్రతో కలిసి పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అట్రాసిటీ కేసు కూడా నమోదు కావడంతో విచారణ చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు.

నమో.. నారసింహో

పానకాలస్వామి చెంతకు పోటెత్తిన భక్తులు



తాడేపల్లి రూరల్ : మంగళగిరి నగరంలోని లక్ష్మీ నరసింహుని సన్నిధికి బుధవారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచే ఎగువ, దిగువ సన్నిధుల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం లోపల నుంచి గాలిగోపురం వరకు స్వామి దర్శనం కోసం బారులు తీరారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి కుష్ఠ రోగుల గుర్తింపు

ప్రత్తిపాడు: జాతీయ కుష్ఠ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2 వరకు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ చేపట్టనుంది. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ) ద్వారా ఆరోగ్య సిబ్బంది 16 రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయనున్నారు. ఇందుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను వైద్యాధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. కుష్ఠ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు వ్యాధిగ్రస్తులను గుర్తించనున్నారు. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స ద్వారా అంగ వైకల్యం బారిన పడకుండా ఉండవచ్చు. సర్వేలో తొలుత ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారు. ఎవరికైనా లక్షణాలు ఉంటే ఏఎన్‌ఎంకు తెలియజేస్తారు. వారు మరోసారి పరీక్షించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. ఈ వివరాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి వెళతాయి. వైద్యుడు రోగిని పరీక్షించి వ్యాధి నిర్ధారణ చేస్తారు. నిర్ధారణ అయితే ఉచితంగా మందులు కూడా అందిస్తారు. సర్వేకు ఆశా కార్యకర్తలకు సహకరించాలని పెదగొట్టిపాడు వైద్యాధికారి మేరీ యునిస్ కోరారు.

మందడంలో పోలేరమ్మకు తొలి ఏకాదశి సారె



తాడికొండ: తుళ్లూరు మండలం మందడంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా అమరావతి రైతులు గ్రామ దేవత పోలేరమ్మకు బుధవారం సారెను సమర్పించారు. మేళతాళాల నడుమ కావడిపై ఏకాదశి సారెను ఊరేగింపుగా తీసుకొచ్చారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కోలుకున్న ఏడుగురు కార్మికులు

జగ్గయ్యపేట: అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కార్మికుల్లో ఏడుగురు కోలుకున్నారు. వారిని ఆస్పత్రులను నుంచి డిశ్చార్జి చేశారు. మండలంలోని బూదవాడ గ్రామంలో ఉన్న సిమెంట్ కర్మాగారంలో ఈ నెల ఏడో తేదీన బాయిలర్ పేలిన ఘటనలో 16 మంది కార్మికులు గాయపడ్డారు. వారిలో చికిత్స పొందుతూ నలుగురు మృతి చెందిన విషయం విదితమే. మరో 12 మంది విజయవాడ మణిపాల్, ఆంధ్రా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మంగళవారం రాత్రి ఉత్తరప్రదేశ్‌కు చెందిన అరవింద్‌యాదవ్, శుభం సోమి, గుడ్డు కుమార్, దినేష్ కుమార్, నాగేంద్ర చౌరాన, బిహార్‌కు చెందిన బైబిక్ సింగ్, బూదవాడ గ్రామానికి చెందిన బాణావత్ సైదాను ఆస్పత్రుల నుంచి డిశ్చార్జి చేశారని తహసీల్దార్ శేషగిరి బుధవారం తెలిపారు. మరో ఐదుగురు చికిత్స పొందుతున్నారని, వారి ఆరోగ్యం నిలకడగా ఉందని ఆయన పేర్కొన్నారు.

గంజాయి రహిత జిల్లానే లక్ష్యం

- నూతన ఎస్పీ తుషార్ డూడి
- జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ



బాపట్ల టౌన్: బాపట్ల జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 2018 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన తాను మొదటగా కర్నూలు జిల్లాలో ట్రైనీ ఎస్పీగా విధుల్లో చేరానన్నారు. అక్కడి నుంచి అసాల్ట్ కమాండర్‌గా, చింతపల్లి, కడప జిల్లాల్లో అడిషనల్ ఎస్పీగా పని చేసినట్లు చెప్పారు. 2024 ఫిబ్రవరిలో గుంటూరు ఎస్పీగా బాధ్యతలు చేపట్టి ఎన్నికల ప్రక్రియను సమర్థంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలో భాగంగా బాపట్ల జిల్లాకు వచ్చినట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు నిష్పక్షపాత సేవలు అందిస్తూ, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని పటిష్టంగా అమలు చేస్తామని ఆయన వివరించారు. మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాలు మీద ప్రత్యేక దృష్టి పెడతామని, వాటిని అరికడతామని తెలిపారు. పెండింగ్ కేసుల విచారణలో సాంకేతికతను జోడించి వేగంగా దర్యాప్తు చేస్తామని స్పష్టం చేశారు. సముద్ర తీర ప్రాంతంలో భద్రత చర్యలపై మరింత దృష్టి పెడతామని చెప్పారు. మాదకద్రవ్యాల కట్టడి చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. రాబోయే రోజుల్లో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలియపరచడానికి హెల్ప్ లైన్ నెంబర్‌ను ప్రారంభిస్తామని వెల్లడించారు. ప్రజలు కూడా సమాచారం అందించాలని ఆయన కోరారు.

అంకితభావంతో పనిచేయాలి

అనంతరం జిల్లాలోని పోలీస్ అధికారులతో ఎస్పీ సమావేశమయ్యారు. తొలుత నేరాలపై సమీక్షించారు. ఇప్పటివరకు నేరాలు జరిగిన తీరు..ఏ తరహా కేసులు ఈ ప్రాంతంలో అధికంగా నమోదవుతుంటాయనే విషయాలపై ఆరా తీశారు. సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ పోలీస్ శాఖకు పేరు, ప్రఖ్యాతలు తేవాలని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, చిన్నారులు, మహిళలపై దాడులకు పాల్పడే వ్యక్తులపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, బాపట్ల డీఎస్పీ సీహెచ్. మురళీకృష్ణ, చీరాల ఇంచార్జి డీఎస్పీ పి.జగదీష్ నాయక్, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఐజీని కలిసిన ఎస్పీ

బాపట్ల జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ తుషార్ డూడి బుధవారం సాయంత్రం గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐజీ సూచించారు.

అర్జునా.. ఫల్గుణా !

- వర్షాకాలంలో ముందు జాగ్రత్తలతో పిడుగుపాటు నుంచి రక్షణ
- పొలాల్లో పనిచేసే వారు అప్రమత్తంగా ఉండాలి
- చెట్లు, టవర్ల కిందకు వెళ్లడం ప్రమాదకరం
- జిల్లాలో ఇప్పటి వరకూ 25 మంది, 500 గొర్రెలు, మేకలు మృతి



అద్దంకి: వర్షాకాలంలో పిడుగులు పడి మనిషి ప్రాణాలకు ముప్పుతో పాటు ఒకోసారి ఆస్తి నష్టం కూడా వాటిల్లుతుంది. ఈ ఏడాది పిడుగుల వల్ల జిల్లాలో 25 మంది వరకూ మరణించారు. 500 వరకు గొర్రెలు, మేకలు, గేదెలు తదితర మూగ జీవాలు మృతి చెందాయని గణాంకాలు చెబుతున్నాయి. అయితే, పిడుగులు పడే సమయంలో పొలాల్లో పనిచేసేవారు, ఇళ్లలో నివసించే వారు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాల్ని రక్షించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

పిడుగు అంటే ఏమిటి?

పిడుగును ఇంగ్లిష్‌లో థండర్ స్టోన్ అంటారు. మేఘాలు ఢీకొన్నప్పుడు వెలువడే కాంతిని మెరుపు అని, శబ్దాన్ని ఉరుము అంటారు. ఈ సమయంలో వెలువడే విద్యుత్‌ను పిడుగు అంటారు. ఇందులో దాదాపు 30 కోట్ల ఓల్టుల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.

పిడుగు పాటుకు గురి కాకుండా ఉండాలంటే..?

- వర్షాలు పడుతున్న సమయంలో సెల్‌ఫోన్, ఎఫ్‌ఎం రేడియో వాడకూడదు.
- భారీ వర్షం పడే సమయంలో కారులోనే ఉండడం క్షేమదాయకం.
- వీలైతే పొడి భూమి ఎక్కడుందో చూసి వెళ్లాలి.
- పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు సురక్షితమైన ప్రాంతాలకు వెళ్లాలి.
- ఎక్కడా ప్రాణాల్ని రక్షించుకునే అవకాశం లేనప్పుడు తలను మోకాళ్లపై పెట్టి ముడుచుకుని కూర్చోవాలి. దాంతో పిడుగు మనపై పడే అవకాశం తగ్గుతుంది.
- చెట్లు, టవర్ల కిందకు వెళ్లకూడదు.
- ఉరుములు సమయంలో బైక్‌లు నడపకూడదు.
- అరికాళ్లను భూమిపై పెట్టకుండా వేళ్లపై కూర్చోవాలి.
- నీరున్న ప్రాంతం నుంచి దూరంగా వెళ్లిపోవాలి.
- ఇంట్లో ఎలక్ట్రానిక్ పరికరాలు ఆఫ్ చేయాలి. ప్లగ్‌లు తీసేసి ఉంచాలి.
- ఎలక్ట్రిక్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి.
- ఇంట్లో ఉంటే బయటకు రాకుండా ఉండాలి.
- మెరుపులు, ఉరుముల సమయంలో స్నానం చేయకూడదు. అంట్లు తోమ కూడదు.
- పిడుగుపాటుకు గురైన వారికి వెంటనే చికిత్స అందించాలి. వారిని ముట్టుకుంటే షాక్ కొడుతుంది అనేది అపోహ మాత్రమే.

ఆస్తి, ప్రాణ రక్షణ ఇలా ...

రాగి, ఇత్తడి లోహాలు ఉరుముల్ని ఆకర్షిస్తాయి. పిడుగులు పడకుండా ఇళ్లపై రాగి తీగలు ఏర్పాటు చేసుకుంటే అస్తినష్టంతో పాటు ప్రాణ నష్టం తప్పుతుంది. ఎందుకంటే పిడుగులో ఉండే ధనావేశ విద్యుత్ నేలకు అనుసంధానించిన రాగి తీగను తాకడం వల్ల తటస్థం అవుతుంది.

శబ్దం నుంచి రక్షణ

పిడుగుపడే ముందు మెరుపు మెరుస్తుంది. తరువాత కొంత సేపటికి భారీ శబ్దంతో కూడిన ఉరుము వస్తుంది. దాన్ని మన చెవులు తట్టుకోలేవు. కొన్నిసార్లు కర్ణభేరి పగలడమో, శాశ్వత చెవుడు ఏర్పడటమో జరుగుతుంది. అటువంటి సమయంలో చెవును మూసుకోవడం చేయాలి.. లేదా నోరు తెరవాలి. దీనివల్ల ఆ శబ్దం చెవి నుంచి నోటి ద్వారా విస్తరించి ప్రమాదం తప్పుతుంది. అందుకే పెద్దవారు పిడుగు పడే సమయంలో నోరు తెరచే విధంగా అర్జునా.. ఫల్గుణా ! అని అనమంటారు. సైన్స్‌నే పెద్దలు ఆ విధంగా చెప్పి ఉంటారని అర్థం చేసుకోవచ్చు.

ఏ ప్రాంతంలో పడుతుందో కూడా తెలుసుకోవచ్చు

ప్రస్తుతం విజ్ఞాన శాస్త్రం అభివృద్ధి చెందిన సమయంలో వాతావరణ శాఖ నిపుణుల ద్వారా అందిన సమాచారం మేరకు స్థానిక రెవెన్యూ శాఖ వారు ఏయే ప్రాంతాల్లో పిడుగు పడే అవకాశం ఉందో కూడా తెలుసుకుని ప్రజల ప్రాణాల్ని రక్షించువచ్చు.

బియ్యం, కందిపప్పు విక్రయ కౌంటర్ ప్రారంభం

కర్లపాలెం: ప్రజలకు తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు విక్రయించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్లపాలెంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని పౌర సరఫరాలశాఖ జిల్లా అధికారి ఒ.విలియమ్స్ తెలిపారు. కర్లపాలెం సిద్ధేశ్వర రైస్ మిల్లు ప్రాంగణంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాలరెడ్డి, తహసీల్దార్ నిర్మలానందబాబా, సివిల్ సప్లై డీటీ ఓంకార్, నాయకులు గుంపుల కన్నయ్య, పఠాన్ అహ్మద్‌బాషా, సుజాత, వెంకటరామరాజు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు పబ్బిశెట్టి వెంకటరంగారావు, ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రజలకు నిత్యావసరాలు అందజేస్తున్న పౌర సరఫరాల జిల్లా అధికారి విలియమ్స్

సత్రశాలలో ఏకాదశి వేడుకలు

రెంటచింతల: మండలంలోని ప్రముఖ, అతి పురాతన శైవక్షేత్రమైన సత్రశాలలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకుడు చిట్టేల శివశర్మ నేతృత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తొలుత ఏడు పంచలోహ విగ్రహాలను దేవస్థానం ఆవరణలో ప్రతిష్ఠించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థానం వద్ద భక్తులకు దుర్గి మార్కెట్ యార్డు డైరెక్టర్ వెన్నా వెంకటేశ్వరరెడ్డి ప్రసాదం పంపిణీ చేశారు. సుమారు 4 వేల మందికిపైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని ఈఓ బుర్రి నెమలిరెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ బొద్దూరి బ్రహ్మారెడ్డి తెలిపారు.



సత్రశాల దేవస్థానంలో ప్రతిష్ఠించిన దేవతామూర్తుల విగ్రహాలు

కసాయి తండ్రి

- కన్నకూతురిపై లైంగికదాడి
- మద్యం తాగినప్పుడల్లా పైశాచికత్వం
- చిన్నారి అనారోగ్యానికి గురవడంతో బయటపడిన అకృత్యం

గుంటూరు రూరల్: కన్న కూతురు పైనే ఓ తండ్రి పైశాచికత్వాన్ని ప్రదర్శించాడు. పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. సభ్యసమాజాన్ని నివ్వెరపరిచే ఈ ఘటన గుంటూరు జిల్లా నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగు చూసింది. సీఐ వంశీధర్ కథనం ప్రకారం.. మండలంలోని ఒక గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థిని చదువును మధ్యలో ఆపేసి ఇంటివద్దనే ఉంటోంది. ఈ క్రమంలో పండ్ల వ్యాపారం చేసే తండ్రి మద్యం మత్తులో మూడు నెలల కిందట ఇంటివద్ద ఒంటరిగా ఉన్న కుమార్తెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఎవరికీ చెప్పవద్దని బెదిరించాడు. దీంతో చిన్నారి ఎవరికీ చెప్పకపోవటంతో మద్యం తాగినప్పుడల్లా పైశాచికంగా దాడి చేశాడు. ఈ క్రమంలో బాలికకు పలు అనారోగ్య సమస్యలు రావడంతో తల్లి ఆమెను చికిత్స నిమిత్తం వైద్యుల వద్దకు తీసుకెళ్లింది. సమస్యను గుర్తించిన వైద్యులు బాలికను అడగడంతో అసలు విషయం వెలుగుచూసింది. దీంతో తల్లి పోలీసుల్ని ఆశ్రయించింది. పోక్సో కేసు నమోదు చేసిన నల్లపాడు పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ వంశీధర్ తెలిపారు.